క్లుప్తంగా

రూ.5 లక్షల చెక్కు అందజేత



వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని నాగవరం గ్రామానికి చెందిన మంగలి కృష్ణయ్య విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షల పరిహారాన్ని మంజూరు చేయించడంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. విద్యుత్ శాఖ ద్వారా మంజురైన రూ.5లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయసుధ, విండో డైరెక్టర్ నాగేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



గోపాల్‌పేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వంట గది, స్టోర్ రూంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. స్టోర్ రూంలో బియ్యం ఎంతమేర ఉన్నాయని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కార్మికుల హక్కులకు భంగం



ఆత్మకూర్: దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని, కార్మికులందరూ ఏకమై హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో కార్మికులతో కలిసి ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం టీయూసీఐలో విలీన సభ పోస్టర్లను విడుదల చేశారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



కొత్తకోట రూరల్: మండలంలోని సంకిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది మూలమళ్ల దామోదర్ రెడ్డి ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. ఇటీవల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయవాది మూలమళ్ల దామోదర్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందం కలిసి పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించేందుకు ప్రింటర్ లేనందున ఇబ్బంది పడుతున్నామని, ప్రింట్ అందించాలని కోరారు. స్పందించిన దామోదర్‌రెడ్డి రూ.20వేల విలువల ప్రింటర్‌ను (జిరాక్స్ మిషన్) పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు తిరుపతయ్య, భాస్కర్, సునిల్, అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

గట్టు: మండలంలోని మాచర్ల గ్రామంలో మంగళవారం తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల లీడర్లు, మహిళలు గ్రామీణ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మహిళా సంఘం లీడర్లు, కూలీలను సన్మానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీవీవీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళలే వెన్నెముక అని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం మహిళలు అనేక పనులు చేస్తున్నప్పటికీ భూమి హక్కులు, విద్య, వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత మహిళల ఉపాధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీవీవీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, సంఘం లీడర్లు నర్సమ్మ, కేశమ్మ, లావణ్య, మహేశ్వరి, శృతి, జయమ్మ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింతలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్ నదీం



తెల్లరాళ్లపల్లిలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్, స్పెషల్‌ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా 10వ వార్డులో కౌన్సిలర్ తబస్సుంమోసీన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఇంటి ఆవరణలోని హౌజ్‌ల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. దోమలు వ్యాప్తి చెందకుండా ద్రావణాన్ని పిచికారీ చేసారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

అమరచింత: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వీడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకున్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టంపల్లి స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించారు. ఈమేరకు ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ మురుగుకాల్వలలో దోమలు నివారణ మందులను పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

మున్సిపాలిటీలో..

పరిసరాల పరిశుభ్రత కోసం ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం కోరారు. పట్టణంలోని ఏడో వార్డులో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగునీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ చల్లారు. రహదారిపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించడం వంటి పనులను మున్సిపల్ కార్మికులతో చేయించారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, మాధరావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైడేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యాధికారి తారశశాంక్, వైద్య సిబ్బంది రాంచందర్, మదన్‌గోపాల్, సంతోషిదేవి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన గోపాల్‌పేట మండలంలోని పోలికెపాడులో డ్రైడే, జ్వరపీడిత సర్వే చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. నీటితొట్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువుల్లో నీటిని నిల్వలు లేకుండా పారబోయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ కుమారస్వామి, హెల్త్ ఆఫీసర్స్ శ్రీనివాస్, సిద్దగౌడ్, సిబ్బంది సుచిత్ర, సుమిత్ర, రమాదేవి, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



శాగాపూర్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



కిష్టంపల్లిలో జీపీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



ఆత్మకూర్‌లో..

‘ఆలయాలపై దాడులను అరికట్టాలి’



రాస్తారోకో చేస్తున్న బీజేపీ, హిందూవాహిని నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రంలో వరుసగా ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో హిందూవాహిని ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో కేవలం వారంరోజుల వ్యవధిలో మూడు ఆలయాలపై దాడులు జరిగాయని, దుర్గామాత విగ్రహాలను ధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ, హిందూవాహిని నాయకులు అశోక్‌నంద, కుమ్మరిమాసన్న, మనోహర్‌గౌడ్, భీంరెడ్డి, తమ్మలివిజయ్, ఆంజనేయులు, అశోక్‌భూపతి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, శ్యామ్, చందు, సూరి, రామకృష్ణారెడ్డి, శివరాములు, సమద్, నీలారెడ్డి తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లకు చెందిన బిజ్జా వెంకటేష్ సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేశామని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు బిజ్జా వెంకటేష్‌కు ఫోన్ అందజేశారు.

వరిధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ అరవింద్

అమరచింత: త్వరలో ఏర్పాటు చేయనున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముందస్తుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని ఏఓ అరవింద్ తెలిపారు. మండలంలోని ఈర్లదిన్నెలో మంగళవారం రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. రుణమాఫీ విషయంలో రైతులకు ఉన్న సమస్యలు, ప్రస్తుత వరి పంటపై ఆశించిన సుడిదోమ, బ్యాక్టీరియా ఆకు, ఎండు తెగులు, పొట్టకుళ్లు తెగులు మొదలైన వాటిని ఎలా నివారించాలనే విషయాలను వివరించారు. అదే విధంగా వచ్చే యాసంగి నారుమడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత పత్తి పంట కోత తర్వాత మినుము పంట సాగు చేయడంలో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ పథకంపై ఉండే సందేహాలను రైతులతో చర్చించామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన జె.ప్రభాకర్ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో బాధితుడి కుటుంబ సభ్యులు స్థానిక నాయకులను సంప్రదించారు. వారు వెంటనే దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్వోసీ కాపీని మంగళవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్‌జె.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, బీచుపల్లియాదవ్, సుభాష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతు నేస్తంలో పాల్గొన్న అధికారులు, రైతులు

పాన్‌గల్: రైతులకు పంటల సాగు, సస్యరక్షణ అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో నేరుగా మాట్లాడటం, వారి సలహాలు అందించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సాజీద్ రహమాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. యాసంగిలో పంటల సాగు, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల ఎంపిక, వినియోగం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో పాటు రైతు రుణమాఫీకి సంబంధించిన సమస్యలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో చాదర్ ఊరేగింపు



అమరచింత: గ్యార్వి నెల ప్రారంభంతో పట్టణంలోని శ్రీ సయ్యద్ షా మహబూబ్ హుస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్‌కు భక్తిశ్రద్ధలతో చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఉర్సు నిర్వాహకుడు జిలాని మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్యార్వి నెల మొదటి రోజు నుంచి మూడు రోజుల పాటు దర్గా వద్ద ఉర్సు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

వీపనగండ్ల: మాలల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని జిల్లా మాల ఉద్యోగుల సంఘం నాయకులు జెట్టి వెంకటస్వామి అన్నారు. ఈ నెల 27వ తేదీన నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభకు చెందిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలో ఆయన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని వివిధ పార్టీల నాయకులు ప్రకటించడం మాలలకు అన్యాయం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎస్సీలకు లభిస్తున్న రాయితీల్లో మాదిగలే అధిక శాతం లబ్ధి పొందుతున్నారని వాపోయారు. మాలల హక్కుల పరిరక్షణ కోసం ఆత్మగౌరవ సభను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామేశ్వర్‌రావు, వీరయ్య, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు మోజర్ల నాగముని, చిన్న కురుమయ్య, చెన్నయ్య, కేశవులు, చిన్ని కృష్ణ, వెంకటేష్, రామస్వామి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయం



కొత్తపల్లి వద్ద రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షం వచ్చిన ప్రతిసారి నీరు చేరి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతి రోజు ఆత్మకూరు నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల్లో వర్షపు నీరు చేరడం ద్వారా ద్విచక్ర వాహనదారులను గుంతలను అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు ఏర్పడి రోడ్డంతా ప్రమాదభరితంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

వనపర్తి రూరల్: రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు మోటారు వెహికిల్ యాక్ట్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మోహన్ అధ్యక్షతన బొలెరో, ట్రాలీ వర్కర్స్‌తో విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి ప్రమాదాలకు సైతం భారత న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్లను దోషులుగా చిత్రీకరిస్తూ, జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. ఎలాంటి ప్రమాదం జరిగిన డ్రైవర్లను జైలుకు పంపే చట్టాలను రద్దు చేయాలని అన్నారు. అనంతరం 100 మంది కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో రాములు, మోహన్, కృష్ణ, రామకృష్ణ, గంధం కృష్ణయ్య, గుంటి కరుణాకర్, బుచ్చన్న, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బండరావిపాకులలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించిన బక్కయ్య, నాగమ్మ దంపతుల కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయన రేవల్లి మండలంలోని బండరావిపాలకు వెళ్లి బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి పథకాలు అమలు అయినా మొదటి ప్రాధాన్యత ఆ కుటుంబానికే అందిస్తామని హామీనిచ్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పోషయ్య మరణించగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, యాదవ్, మాజీ సర్పంచ్ సత్యశీలారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మండలంలోని తాడిపర్తికి చెందిన 30 మంది యువకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ నాయకుడు లోకారెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ పేదల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు నచ్చడంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు, పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు.

‘ప్రతిభతో ప్రపంచాన్ని జయించొచ్చు’



కనిమెట్టలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు

వనపర్తిటౌన్: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించి ప్రపంచ మానవాళికి అబ్దుల్ కలాం స్ఫూర్తిగా నిలిచారని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్, ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాగరాజు, దేవన్న, బాలేమియా, నరసింహ, పరమేశ్వరాచారి, సత్యం, రామచారి పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: స్థానిక గ్రంథాలయంలో పాఠకులు, రాజకీయ నాయకులు, సిబ్బంది సమక్షంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, లైబ్రేరియన్ ఎండీ తాజోద్దీన్, సంద వెంకటేష్, ఆశన్న, బాల్‌రెడ్డి, రసూల్, వెంకటేష్, నరేష్, మస్తాన్ తదితరులు ఉన్నారు.

కనిమెట్టలో..

మండలంలోని కనిమెట్ట పల్లెప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గాదం పరమేష్, సురేష్, బాబు, రాంరెడ్డి, భరత్, శేఖర్, నర్సింహ, రాజు, అంజి, మల్లేష్, కరీం, అబ్దుల్లా, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

‘బీజేపీ అధికారం చేపట్టడం ఖాయం’



సభ్యత్వం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ తదితరులు

ఖిల్లాఘనపురం: రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారం చేపడుతుందని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జ్ నరేందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజలతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ఎంతో మంది నిరుపేదలకు ధైర్యాన్ని ఇస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, రాకాసి అరవింద్‌రెడ్డి, సత్యం, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రాంచందర్

బీజేపి మండల ఓబీసీ అధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన చిట్యాల రాంచందర్‌ను జిల్లా కమిటీ సభ్యులు నియమించారు. మండలంలో సీనియర్ కార్యకర్తగా పనిచేసిన ఆయనను మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, కార్యదర్శి ఆశన్నల ఆధ్వర్యంలో నియమించి నియామక పత్రం అందించారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి



కమిషనర్ శశిధర్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్, పాలకమండలి సభ్యులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కమిషనర్‌గా విధుల్లో చేరిన చికినే శశిధర్‌కు మంగళవారం పురపాలిక పాలక మండలి సభ్యులు పూలమాల, శాలువాలతో స్వాగతం పలికారు. ఆత్మకూర్ పట్టణ అభివృద్ధికి పాలకమండలి, వార్డుల అధికారులు, సిబ్బంది సంపూర్ణంగా సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మహేశ్వరి, పోషన్న, యాదమ్మ, నాగలక్ష్మి, తబస్సుంమోసీన్, కోఆప్షన్ సభ్యులు రియాజ్‌అలీ, కిషన్‌చంద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.